

రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేయాలి

ఇన్‌ఛార్జి జెసి సూర్య తేజ

భీమవరం :జిల్లాలో ముఖ్య పంటలుగా ఉన్న హార్టీకల్చరు, కొబ్బరి, మామిడి, కూరగాయలు, ఆక్వా రంగం, గొర్రెలు, పశువులు తదితర రైతులకు సంబంధించి రైతు ఉత్పత్తిదారుల సంఘం '(యఫ్‌పిఒ)గా ఏర్పాటు చేయాలని ఇన్‌ఛార్జి జిల్లా జాయింటు కలెక్టర్ ఎం.సూర్య తేజ అన్నారు. సోమవారం జిల్లా జాయింటు కలెక్టరు ఛాంబరు లో రైతు ఉత్పత్తుల దారుల సంఘాల ఏర్పాటుపై వ్యవసాయ, హార్టీకల్చర్, నాబార్డు అధికారులతో జెసి సమీక్షించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తుల దారుల సంఘాలు ఏర్పాటు చేసి రైతులకు మరింత ప్రయోజనాలు కల్పించి వారికి గిట్టుబాటు ధర, లాభాలు చేకూర్చాలని సంఘాల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. జిల్లాలో మొదటి విడత 4 ఏర్పాటు చేయాలని, నరసాపురం, పెనుగొండ, ఆచంట, తాడేపల్లిగూడెంను గుర్తించామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా హార్టీకల్చర్ ఎ.దుర్గేశ్, నాబార్డు డిడి ఎం.అనీల్ కాంత్ పాల్గొన్నారు.

వారికే మరో ఛాన్స్..!

వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థుల జాబితా విడుదల

స్థానిక ఎంఎల్‌సి స్థానాలకు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్ర అభ్యర్థిత్వాలు ఖరారు

ఎంఎల్‌ఎ కోటాలో జయమంగళ వెంకటరమణకు ఛాన్స్

తీవ్ర అసంతృప్తిలో ఆశావహులు

జెడ్‌పి ఛైర్మన్ పదవి కోసం మొదలైన వ్యూహాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


జిల్లాలోని స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల అభ్యర్థుల జాబితాను అధికార వైసిపి సోమవారం విడుదల చేసింది. స్థానిక సంస్థల కోటాలో ఉమ్మడి జిల్లాలో ఖాళీ అయిన రెండు ఎంఎల్‌సి స్థానాల్లో ఒకటి ప్రస్తుత జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు, రెండో స్థానానికి మధ్యతరహా పరిశ్రమల కార్పొరేషన్ ఛైర్మన్ వంకా రవీంద్రను ఎంపిక చేశారు. ఎంఎల్‌ఎ కోటాలో ఇటీవలే టిడిపి నుంచి వైసిపిలో చేరిన కైకలూరు మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణకు అవకాశం కల్పించారు. ఎంఎల్‌సి అభ్యర్థుల ఎంపికపై ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ ఏర్పడినప్పటి నుంచి కష్టపడి పని చేస్తున్న వారికి అవకాశం ఇవ్వకుండా ప్రస్తుతం పదవులు అనుభవిస్తున్న నాయకులకే మళ్లీ ఎంఎల్‌సి పదవులు కట్టబెట్టడం ఏమిటని పార్టీలో నాయకులు, కార్యకర్తల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి రెండు పదవుల్లో ఒకటి బిసి, రెండోది జనరల్‌కు కేటాయించనున్నట్లు ముందుగానే స్పష్టత వచ్చింది. టిడిపి నుంచి వైసిపిలోకి వచ్చిన జయమంగళ వెంకటరమణ బిసి కావడంతో మరో పదవి జనరల్ కేటగిరీలో ఇస్తారని అంతా భావించారు. అయితే వైసిపి అధిష్టానం అందరికీ షాక్ ఇచ్చేవిధంగా అభ్యర్థులను ఎంపిక చేసింది.

పదవుల్లో ఉన్న వారికే మళ్లీ పదవులు

ప్రస్తుతం జెడ్‌పి ఛైర్మన్‌గా కవురు శ్రీనివాస్ ఉన్నారు. ఈయనకు ఇంకా దాదాపు మూడున్నరేళ్ల పదవీకాలం ఉంది. పాలకొల్లుకు చెందిన గుణ్ణం నాగబాబుకుగాని, మేకా శేషుబాబుకుగాని ఎంఎల్‌సి పదవి వరిస్తుందని అంతా భావించారు. అయితే వైసిపి అధిష్టానం మాత్రం కవురు శ్రీనివాస్ పేరును ప్రకటించింది. గుణ్ణం నాగబాబుకు ఎంఎల్‌సి పదవిపై నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో వైసిపి అధిష్టానం వ్యూహం మార్చినట్లు తెలుస్తోంది. గుణ్ణంకు పదవి ఇస్తే మేకా శేషుబాబు ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగే అవకాశం ఉందని ప్రచారం సాగింది. అదే జరిగితే ఎంఎల్‌సి ఎన్నికలు అనివార్యం కావడంతోపాటు శెట్టిబలిజ, గౌడ సామాజిక తరగతి శేషుబాబుకు వెన్నుదన్నుగా నిలబడే అవకాశం ఉంటుందని అంచనా వేసినట్లు సమాచారం. అదే సామాజిక తరగతికి చెందిన కవురు శ్రీనివాస్‌కు ఇస్తే శేషుబాబు పోటీ చేసే అవకాశం ఉండకపోగా శెట్టిబలిజ, గౌడ సామాజిక తరగతిలో పార్టీకి పేరు వస్తుందని లెక్కలు వేసినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో టిడిపి నుంచి నిమ్మల రామానాయుడు ఎంఎల్‌ఎగా పోటీచేసే అవకాశం ఉంది. రామానాయుడు కాపు సామాజిక తరగతి కావడంతో అదే తరగతికి చెందిన గుణ్ణం నాగబాబుకు ఎంఎల్‌ఎ టిక్కెట్ ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. కవురు శ్రీనివాస్‌కు ఎంఎల్‌సి సీటు ఇవ్వడంతో నాగబాబుకు టిక్కెట్ విషయంలో పోటీ కూడా ఉండదు. ఈ ఎత్తుగడతోనే కవురుకు ఎంఎల్‌సి ఇచ్చినట్లు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందిన వంకా రవీంద్ర ఇప్పటికే మధ్యతరహా పరిశ్రమల కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఆర్థికంగా నష్టపోవడంతో ఎంఎల్‌సి పదవి కోసం ఈయన గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది. దీంతో మరో పదవి వంకా రవీంద్రకు ఇచ్చినట్లు చెబుతున్నారు. రెండు ఎంఎల్‌సి పదవులు నరసాపురం పార్లమెంట్ స్థానంలో ఇవ్వడం సైతం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. మెట్ట ప్రాంతానికి పదవి ఇవ్వకపోవడం చర్చనీయాంశమవుతోంది. టిడిపి నుంచి ఎంఎల్‌సి పదవి హామీతో వైసిపికిలోకి వచ్చిన జయమంగళ వెంకటరమణకు ఎంఎల్‌ఎ కోటాలో ఎంఎల్‌సి అవకాశం కల్పించారు. జయమంగళ కూడా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. ఎంఎల్‌సి పదవి ఆశించిన వారిలో నల్లజర్లకు చెందిన కారుమంచి రమేష్‌తోపాటు పలువురికి తీవ్ర నిరాశే మిగిలింది.

జెడ్‌పి ఛైర్మన్ పదవి కోసం వ్యూహాలు

ప్రస్తుత జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు ఎంఎల్‌సి టిక్కెట్ ఖరారు చేయడంతో తదుపరి జెడ్‌పి ఛైర్మన్ పదవి ఎవరికిస్తారనే చర్చ నడుస్తోంది. బిసి సామాజిక తరగతికి చెందిన పలువురు జెడ్‌పిటిసిలు ఛైర్మన్ పదవి కోసం ఇప్పటికే అధిష్టానం వద్దకు క్యూ కట్టినట్లు తెలుస్తోంది. ఈ నెల 23వ తేదీతో ఎంఎల్‌సి నామినేషన్ల తుదిగడువు ముగియనుంది. ఎంఎల్‌సి ఎన్నిక అధికారికంగా ఖరారవ్వగానే కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి కోసం నాయకుల వ్యూహాలు సాగుతున్నాయి.



తాడేపల్లిలో సిఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంఎల్‌సి అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్ర, జయమంగళ వెంకటరమణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

'స్పందన' అర్జీలు త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 142 వినతలను కలెక్టర్ స్వీకరించి మాట్లాడారు. ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా చదివి కాలయాపన లేకుండా పరిష్కరించాలన్నారు. పూర్తి పరిష్కారం చూపినప్పుడే అర్జీదారుని మన్ననలను పొందగలుగుతామన్నారు. సమస్య పరిష్కరించడంతోపాటు మండల స్థాయిలో పరిష్కరించిన సమస్యలను ఓపెన్ చేసి అవి సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి ఆడిట్ చేయాలని సూచించారు. స్పందన పరిష్కారానికి జిల్లా, మండల స్థాయిలో ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కన్సిస్టెంట్ రిథం అనే యాప్‌లో విద్యకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కారం చేసే విధంగా ఎంఇఒలు, ఎపిఎంలు, సీసీలు, వెల్ఫేర్ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, జిల్లా జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కెసిహెచ్ అప్పారావు, డిఎస్‌పిబి.శ్రీనాథ్, డిపిఒ ఎం.నాగలత పాల్గొన్నారు.

ఎంఎల్‌సిగా రవీంద్ర అభ్యర్థిత్వంపై హర్షం

ప్రజాశక్తి - తణుకు

తణుకు పట్టణానికి చెందిన ఎంఎస్‌ఎంఇ ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త వంక రవీంద్రనాథ్‌ను స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సి అభ్యర్థిగా అధిష్టానం సోమవారం ప్రకటించింది. ఆయన ప్రస్తుతం ఎంఎస్‌ఎంఇ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. రవీంద్రనాథ్ గతంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. వైసిపిలో చేరినప్పటి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి అధిష్టానం ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటించింది. కాపు సామాజిక వర్గానికి చెందిన రవీంద్రనాథ్‌ను ఎంపిక చేయడంతో నియోజవర్గంలో కాపులకు ప్రాధాన్యతిచ్చినట్లయ్యింది. రవీంద్రనాథ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటించడం పట్ల పారిశ్రామికవేత్తలు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాపులకు ఒకటే ఎంఎల్‌సి స్థానం అన్యాయం

మాజీ మంత్రి హరిరామ జోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

జగన్ ప్రభుత్వంలో కాపులకు విద్య, సామాజిక, రాజకీయంగా అన్యాయం జరిగిందని, ప్రస్తుతం ప్రకటించిన ఎంఎల్‌సి ఎన్నికల్లో కేవలం కాపులకు ఒక స్థానం ఇవ్వడం అన్యాయమని కాపుసేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్య చెప్పారు. ఎంఎల్‌సి అభ్యర్థిత్వాలు ప్రకటించిన అనంతరం ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాపులు సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని జనాభా ప్రాతిపదికన కనీసం మూడు ఎంఎల్‌సి స్థానాలు ఇవాల్సి ఉందని, అయితే కేవలం ఒక్క స్థానం మాత్రమే జగన్ ఇచ్చారని తెలిపారు. రాయలసీమలో బలిజలు 15 లక్షలకు పైగా ఉన్నా ఒక్క సీటు కూడా ప్రకటించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంఎల్‌సిగా శ్రీనివాస్ అభ్యర్థిత్వంపై హర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను అధిష్టానం ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటించడం పట్ల సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో ఫోన్లో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కవురు శ్రీనివాస్ పాలకొల్లు నుంచి పోటీ చేస్తారని చెప్పారు. తాను ఎంఎల్‌సి స్థానం కోసం పోటీపడినా కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌ను అధిష్టానం అభ్యర్థులుగా ప్రకటించిందని, తనకు అసంతృప్తి లేదని, పార్టీ విజయానికి తాను కృషి చేస్తానని తెలిపారు.

మేకా శేషుబాబు పోటీ చేయరు..


ఎంఎల్‌సి అభ్యర్థి స్థానం కోసం తీవ్రంగా కృషి చేసిన మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి విముఖత చూపించారు. అధిష్టానం కవురు శ్రీనివాస్‌ను ప్రకటించిన అనంతరం మేకా శేషుబాబు తన నివాసంలో అభిమానులతో సమావేశం జరిగింది. అయితే కొందరు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కోరినా శేషుబాబు అంగీకరించలేదు. జగన్ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఎవరైనా ఆయన విజయానికి కృషి చేయాలని శేషుబాబు తెలిపారు.

ఎస్‌టి యువతకు చదువుతో నిమిత్తం లేకుండా..

కళ్యాణమస్తును వర్తింపజేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

పెళ్లి చేసుకునే ఎస్‌టి యువతీ యువకులకు చదువుతో నిమిత్తం లేకుండా కళ్యాణమస్తు పథకాన్ని వర్తింపజేయాలని ఎపి మైదాన ప్రాంత గిరిజన సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కవురు పెద్దిరాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో మైదాన ప్రాంత గిరిజనులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ కళ్యాణ మస్తు పథకాన్ని ప్రారంభించి కొత్తగా పెళ్లి చేసుకున్న యువతి యువకులకు వారి వారి సామాజిక తరగతి, కులంత్ర వివాహాలను బట్టి వివాహానికి నగదును అందజేయడం అభినందనీయమన్నారు. అయితే ఈ పథకం అమలుకు పెళ్లి చేసుకునే యువతీ యువకులు పదో తరగతి పాస్ అయి ఉండాలనే నిబంధన పెట్టారని, ఎస్‌టి సామాజిక వర్గంలో చాలామంది కనీస ప్రాథమిక విద్యనభ్యసించిన వారు లేరని తెలిపారు. మైదాన ప్రాంతంలో ఉంటున్న యానాదులు, ఎరుకలు, చెంచులు వంటి వారు స్థిర నిర్వచనం లేకుండా కాలువల గట్లపై జీవిస్తూ చేపలు పట్టుకుంటూ, చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తు న్నారన్నారు. వీరికి చదువుతో నిమిత్తం లేకుండా కళ్యాణమస్తును వర్తింపజేయాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు, శివరాజు, గిరిజనులు పాల్గొన్నారు.



ఆర్‌బికె వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

ఇ-క్రాప్ నమోదు గడువు పొడిగించాలి

ప్రజాశక్తి - ఆచంట

ఇ - క్రాప్ నమోదు తేదీని ఈ నెలాఖరు వరకూ పొడిగించి పేద రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరు సూర్యనారాయణ రాజు అన్నారు. ఈమేరకు సోమవారం వల్లూరు రైతు భరోసా కేంద్రం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వ్యవసాయ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ-క్రాప్ ద్వారా పంట నమోదు చేయించుకోని రైతుల నుంచి ధాన్యం సేకరణ, ఇన్‌పుట్, అవుట్‌పుట్, సబ్సిడీ, పంట నష్టపరిహారం వంటివి వర్తించవని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణం స్పందించి ఇ - క్రాప్ చేయించుకోని పేద రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మిద్దే సత్యనారాయణ, ఖండవల్లి శామ్యూల్, బోళ్ల సుబ్బారావు, ఈతకోట శ్రీనివాస్, పితాని పిచ్చయ్య, నాయకులు బొర్రా ధర్మారావు సుబ్బారావు పాల్గొన్నారు.

బోణీ కాని నామినేషన్లు

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి సోమవారం కూడా నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ వి . అ రు ణ్ బా బు తెలిపారు.

జిల్లా పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలు

ఎంఎల్‌సి ఎన్నికలపై జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఎంఎల్‌సి ఎన్నికలకు జిల్లాలో భీమవరం, నరసాపురం డివిజన్ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా దావాలు, అభ్యంతరాల పరిష్కారం, డూప్లికేట్, సందేశాత్మక ఓట్లు, బ్యాలెట్ బాక్సులు, ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని భీమవరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లు, నరసాపురం మండలం పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 229 ఓట్లు మొత్తం 430 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు, భద్రతా ఏర్పాట్లకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వర్తించే చర్యల్లో భాగంగా ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసి రాజు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కూరగాయల మార్కెట్, జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 31వ వార్షికోత్సవం సోమవారం స్థానిక ఉల్లిపాయల మార్కెట్ ఆఫీసులో ఫైలు పైడియ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. యూనియన్ సీనియర్ నాయకులు ఫైలు పైడియ్య పతాకాన్ని ఆవిష్కరించారు. 2022 కార్యకలాపాల రిపోర్టు యూనియన్ కార్యదర్శి మూడెడ్ల వెంకటరావు ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఎం పెంటపాడు మండలం కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో రైతులపై, కార్మికులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. దేశంలో అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభజించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టడం దారణమన్నారు. జాతీయవాదం పేరుతో అదాని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఏప్రిల్ 5న రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు చేపట్టిన నిరసన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గొర్రెల సతీష్, ప్రధాన కార్యదర్శిగా మూడెడ్ల వెంకట్రావు, కోశాధికారిగా యాసరపు పైడన్న, కమాండర్‌గా లచ్చిపోతుల శ్రీను, రెండో కమాండర్ ఫైలు చిన్న,కమిటీ సభ్యులుగా బత్తి నాగ సత్యనారాయణ, మెరుపుల మురళి, బొబ్బిలి తాతారావు, సుర్ల సింహాద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో చిటికెన రాము, మడకా రాజు, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, మెట్రెడ్డి రమణ, ఫైలు పైడియ్య, రోకళ్ల లోవరాజు, కుంచంగి నానాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నేత నాగేశ్వరరావు



నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులు

కాంట్రాక్టు కార్మికుల నిరవధిక దీక్ష

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు సూర్నీడు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో ఆచార్య ఎన్‌జి రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సోమవారం నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎఎన్‌జిఆర్‌ఎయు పరిధిలోని రీసెర్చ్ స్టేషన్లలో పనిచేస్తున్న కార్మికుల వివరాలను రీసెర్చ్ స్టేషన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ రీసెర్చ్ స్టేషన్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలన్నారు. కాంట్రాక్టర్ కార్మికులకు సంవత్సరం మొత్తం పని చూపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ కార్మికులకు ఇస్తున్న ప్రమాద, సహజ మరణ నష్టపరిహారం కార్మికులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో కూర్చున్న సిఐటియు యూనియన్ కార్యదర్శి ఇంకేటి సుధాకర్, కమిటీ సభ్యుడు గండి నాగరాజు, కార్మికులు డి.నూకరత్నం, కె.శ్రీలక్ష్మి, డి.నాగలక్ష్మి, పిల్లి జగదీష్, ఎం.నాగిరెడ్డి, టి.అరుణ, గెద్దాడ నాగలక్ష్మి, టి.సూర్యకుమారి, జె.పరిమిళ, ఇ.నాగలక్ష్మి, వెలగల సావిత్రికి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజు సంఘీభావం తెలిపారు.


పూర్తిస్థాయిలో సాగునీరివ్వాలని ఆందోళన

ప్రజాశక్తి - ఉండి

పంట పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరందించి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చెరుకువాడ రైతులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపిన సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏటా దాళ్వాలో రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంలో విఫలమవుతోందన్నారు. వంతుల వారీగా నీటిని నీటి పారుదల శాఖ అధికారులు విడుదల చేస్తున్నప్పటికీ ఆక్వా రైతులు కాలువల్లోకి ఇంజన్లు వేసి చెరువుల్లోకి నీటిని తోడుకుంటున్నారని తెలిపారు. ఫలితంగా శివారు పొలాలకు నీరందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. అధికారులు స్పందించి చెరుకువాడ శివారు ప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందించాలని కోరారు. అనంతరం స్పందనలో తహశీల్దార్ ఎం.రవీంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ గ్రామ రైతులు పడమటి త్రిమూర్తులు, పసుపులేటి శేషగిరిరావు, కట్టా సత్యనారాయణ, జన్ను పెద్దిరాజు, కుచ్చు రామాంజనేయులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నేతలు



సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు


సొసైటీ అభివృద్ధికి సర్రాజు ఎనలేని కృషి

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె సహకార బ్యాంకు పరిధిలోని 11 గ్రామాల ప్రజలకు, రైతులకు పాతపాటి సర్రాజు విస్తృత సేవలందించారని సహకార సంఘం అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు అన్నారు. కోపల్లె సహకార బ్యాంకు కార్యాలయంలో సర్రాజు మృతికి సంతాప సభ సోమవారం నిర్వహించారు. ముందుగా సర్రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు మాట్లాడుతూ సర్రాజు 1992-95లో సొసైటీ అధ్యక్షులుగా పని చేసి సొసైటీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. సొసైటీ భవన నిర్మాణ పనులు సర్రాజు హయాంలోనే చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ సాయిగీత, అసిస్టెంట్ సిఇఒ వెంకటేశ్వర్లు, త్రిసభ్య కమిటీ సభ్యులు వెంకట రాంబాబు, పాల్గొన్నారు.

సర్రాజు కుటుంబానికి నారాయణస్వామి పరామర్శ

ప్రజాశక్తి - కాళ్ల



సర్రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నారాయణస్వామి

పాతపాటి సర్రాజు ప్రజలు, రైతుల శ్రేయస్సు కోసం శ్రమించిన నాయకుడని మాజీ మంత్రి యర్రా నారాయణ స్వామి అన్నారు. భీమవరం ఆదర్శ నగర్‌లో సర్రాజు కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యర్రా నారాయణ స్వామి మాట్లాడుతూ పాతపాటి సర్రాజు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడ్డారన్నారు. ఆయన వెంట పాతపాటి వాసు, పాతపాటి వర్మ, డిఎన్ఆర్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు ఉన్నారు.


సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలోని 9, 10, 11, 12 వార్డుల్లో సోమవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు మాట్లాడుతూ కాలానుగుణంగా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా ఇంటి ఆవరణలో పొడిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, శానిటేషన్ కార్యదర్శి మంగరాజు పాల్గొన్నారు.

సాహస బాలిక వినూత్నకు ఎంఎల్ఎ సత్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్



వినూత్నను అభినందిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి

ధైర్య సాహసాలు బాల్యం నుంచే రావాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎంఎల్ఎ కార్యాలయంలో సాహస బాలిక జాతీయ అవార్డు గ్రహీత వినూత్నను ఎంఎల్ఎ అభినందించి సత్కరించారు. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించడం తక్కువని, దగ్గరకు వెళ్లి సహాయం చేసే సంఘటనలు తక్కువేనని, వినూత్న చేసిన సాహసం సమాజానికే ఆదర్శమని అన్నారు. తాను ప్రమాదంలో చిక్కుకుని తన ప్రాణాలతో పాటు నలుగురు ప్రాణాలు కాపాడిన వినూత్నను అభినందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, వినూత్న తల్లి లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమ కళాశాల ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సహకారం అందిస్తోందని కెజిఆర్ఎల్ పీజీ డైరెక్టర్ తోట రామ్మూర్తి అన్నారు. సోమవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో పేద విద్యార్థికి ఆర్థిక సహకారం అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పి రిచర్డ్స్ సన్ ప్రతిభ కలిగిన విద్యార్థి అని, ప్రతిభను గుర్తించి దాతలను సమీకరించాలని, రూ.10 వేలు ఎంబిఎ ఫీజు అందించామని తెలిపారు.

ఎన్నికల్లో జగన్‌కే అధికారం : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి భీమవరం రూరల్

2024లో జరిగే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టడం ఖాయమని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సోమవారం జరిగిన సమావేశంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు కేవలం తమ పార్టీకే ఉందన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్‌కు లేదన్నారు. పవన్‌కళ్యాణ్ 2024 ఎన్నికల్లో భీమవరం నుండి పోటీ చేసినా, రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల నుండి పోటీ చేసినా ఆయనకు ఓటమి తప్పదని స్పష్టం చేశారు. చంద్రబాబు మరోసారి ప్రజలను మోసగించి అధికారంలోకి రావడానికి కుతంత్రాలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు పాల్గొన్నారు.

తారకరత్న మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఆకివీడు

నందమూరి తారకరత్న మృతికి టిడిపి మండల అధ్యక్షులు మొటిపల్లి ప్రసాద్ సోమవారం తన సంతాపం తెలిపారు. నందమూరి కుటుంబంలో మంచి వ్యక్తి మృతి చెందారని, తారకరత్న మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. సంతాపం తెలిపిన వారిలో పార్టీ మండల కార్యదర్శి నవకోట్ల రామారావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొల్లా వెంకట్రావు, గంధం ఉమా సత్యనారాయణ ఉన్నారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

ప్రజాశక్తి - ఉండి

దేవాలయాల పాలక మండల్లో నాయీ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం తప్పనిసరి చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆర్డినెన్స్ తీసుకురావటం అభినందనీయమని ఉండి నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు అన్నారు. ఉండి నాయీ బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ అన్నమయ్య భవనంలో పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లువలస అప్పారావు, దుర్గారావు, ముత్యాలపల్లి రాంబాబు, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లువలస వీర వెంకట సత్యనారాయణ, మల్లువలస హరికృష్ణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని దుంపగడపలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,13,500 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

జీతం ఇవ్వకుంటే బతికేదెలా..!

పంచాయతీ కార్యదర్శికి వేతనం నిలిపివేత - ఎల్‌పిసి ఇవ్వకపోవడమే కారణమని సమాచారం

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజలకు సేవలందిస్తూ విధి నిర్వహణలో ఒత్తిడులను తట్టుకుంటూ ముందుకు సాగుతున్న మండలంలోని ఒక పంచాయతీ అధికారిణికి జీతం ఇవ్వకపోతే ఆమె ఎలా బతుకుతుందంటూ సాటి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకోడేరు మండల నుండి వీరవాసరం మండలానికి బదిలీపై వచ్చిన సదరు పంచాయతీ కార్యదర్శికి ఏడు నెలలుగా జీతం అందడం లేదని సమాచారం. ఏ నిబంధనల ప్రకారం ఆమెకు జీతం అందకుండా సాకులు చూపుతూ అడ్డుకుంటున్నారో ఉన్నతాధికారులు పరిశీలించాల్సి ఉంది. ఒక మండలం నుండి వేరే మండలానికి బదిలీపై వెళ్లినప్పుడు లాస్ట్ పేమెంట్ సర్టిఫికెట్ (ఎల్‌పిసి) ఇవ్వాల్సిన మండలస్థాయి అధికారి ఆమెకు ఇవ్వకపోవడమే జీతం అందకపోవడం కారణమని తెలుస్తోంది. సదురు అధికారిణి పని చేసిన గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల డిమాండ్‌లో ఆడిట్ రిపోర్టులో జరిగిన పొరపాటును కార్యదర్శికి ఆపాదిస్తూ ఉద్దేశపూర్వకంగా ఎల్‌పిసి ఇవ్వడంలేదన్నది మరో వాదన. సదరు కార్యదర్శికి కొన్ని నెలల ఛార్జీ అప్పజెప్పలేదన్న నెపంతోనూ, ప్రస్తుతం ఆడిట్ రిపోర్టులో జరిగిన పొరపాటు నెపంతో జీతం నిలుపుదల చేశారని సమాచారం. ఆడిట్ రిపోర్టులో జరిగిన పొరపాటును సాకుగా చూపుతున్న సంబంధిత అధికారులు ఇంటి పన్ను డిమాండ్ ఎంత ఉందో ఆమె ఎంత వసూలు చేసిందో తెలిపే బిల్లు బుక్‌లు అందుబాటులో ఉన్నా పరిశీలించకుండా తప్పుగా ఉన్న ఆడిట్ రిపోర్టునే సాకుగా చూపుతూ ఎల్‌పిసి ఇవ్వకం పోవడం పట్ల ఒక మహిళా కార్యదర్శి పట్ల మండల స్థాయి అధికారి అమానవీయ స్థితిని తెలియజేస్తుంది. ఇప్పటికే అనేక గ్రామాల్లో పంచాయతీ అధికారులు వారి చేతి పెట్టుబడులు పెట్టి గ్రామ సమస్యలను పరిష్కరించాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో జీతాలు సకాలంలో అందకపోతే ఎలా బతికేదంటూ వారి నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది.

జువ్వలపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం గ్రామంలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. 180 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో బైర్రాజు ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ గోకరాజు వినోద్ రంగరాజు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎంవి.త్రినాథులు, ఉపాధ్యాయులు భాస్కర వర్మ, శ్రీనివాస్, బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎంఆర్‌కె.రాజు, పెనుమాక భానుమూర్తి పాల్గొన్నారు.

పాలకొల్లులో ఏకపాత్రాభినయం పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాల బాలికల ఏకపాత్రాభినయం పోటీలు లయన్స్ క్లబ్‌లో సోమవారం జరిగాయి. పోటీలను మాజీ ఎంఎల్ఎ బాబ్జీ ప్రారంభించారు. బాలబాలికలు చేసిన ఏకపాత్రాభినయం పోటీలు ఆకర్షించారు. విజేతలకు సంఘాధ్యక్షులు కత్తుల రామ్మోహన్, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, విద్యా సంస్థల ఛైర్మన్ మద్దాల వాసు, క్లబ్ అధ్యక్షులు ముచ్చర్ల సత్యనారాయణ, పెనుమాక రామ్మోహన్, వంగా నరసింహారావు, యర్రంశెట్టి వెంకట రత్నం బహుమతులు అందించారు.

గొందిలో ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

నరసాపురం : ఎటువంటి మందులు, ఇంజక్షన్లు, ఆపరేషన్లూ అవసరం లేకుండా ఆక్యుపంక్చర్ రోగాలను తగ్గిస్తుందని ప్రముఖ హైదరాబాద్ కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ సంస్థకు చెందిన వైద్యులు, కొవ్వలి ఫౌండేషన్ కార్యదర్శి కొండా శ్రీధర్ అన్నారు. సోమవారం గొందిలో కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా ఆక్యుపంక్చర్ (సూది వైద్యం) వైద్య శిబిరాన్ని శ్రీధర్ ప్రారంభించి మాట్లాడారు. శరీరంలో వివిధ భాగాలకు సరైన పరిమాణంలో, సరైన సమయంలో సరిపడేంత శక్తి చేరకపోయిన, ఏదైనా ఒక భాగంలో ఎక్కువ శక్తి నిల్వ ఉన్న వివిధ రకాల వ్యాధులు, నొప్పులు వస్తాయన్నారు. వాటిని ఆక్యుపంక్చర్ వైద్యం ద్వారా నివారించవచ్చన్నారు. మరో మూడ్రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకూ ఆక్యుపంక్చర్ శిబిరాలు నిర్వహించి పేదలకు సేవలందిస్తామన్నారు. మంగళవారం వేములదీవి తుపాను బిల్డింగ్ రైతు భరోసా కేంద్రంలో, గురువారం మొగల్తూరు మండలం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ వారి ఆలయం వద్ద, మల్లిఖార్జున సప్లయిర్స్ వద్ద, శుక్రవారం నరసాపురం పట్టణంలో టేలర్ స్కూల్ గ్రౌండ్ వీధి బ్రాహ్మణ సమాఖ్యలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పార్కును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

స్పోర్ట్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక మారుతీనగర్‌లో మున్సిపల్ పార్కును స్పోర్ట్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని మున్సిపల్ అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం మారుతీనగర్ మున్సిపల్ పార్క్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. మున్సిపల్ బడ్జెట్‌లో కొంత కేటాయింపుతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతల సాయంతో సుందరవనంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజలు ఆరోగ్యం దృష్ట్యా యువతీ, యువకులకు ఆట, పాటలతో పాటు మార్నింగ్ వాక్‌కు ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కుకు వచ్చే వారికి కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ఎక్కడా శానిటేషన్‌లోటు లేకుండా చూడాలని, తాగునీరు సదుపాయం కల్పించాలని తెలిపారు. కలెక్టరు వెంట మున్సిపల్ కమిషనరు ఎస్.శివరామకృష్ణ, ఇఇ.విజయ్, ఎసిపి గౌరు పాల్గొన్నారు.

సైనికుడి కుటుంబానికి ఇంటి పట్టా అందజేత

ప్రజాశక్తి - భీమవరం

యుద్ధంలో వీరమరణం పొందిన సిపాయి గంట్ల వీర వెంకట నాగవర్ధన్ తల్లి గంట్ల వెంకటలక్ష్మికి ఇళ్ల పట్టాను కలెక్టర్ పి.ప్రశాంతి అందజేశారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన కార్యక్రమంలో వీరమాత వెంకటలక్ష్మికి 6 సెంట్ల ఇంటి స్థలాన్ని ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామంలో కేటాయించారు. దీనికి సంబంధించిన పట్టాను ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేయడానికి కుట్ర

తణుకురూరల్ : ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. సోమవారం అత్తిలి మండలం పాలూరులో చెరువు వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని అధికారికంగా రద్దు చేయకుండా కూలీలు పని కావాలని డిమాండ్ చేయకుండా నియంత్రించేందుకు పని ప్రదేశంలో కార్మికుల ఫొటో తీయడం, మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయడం, ఆన్‌లైన్ హాజరు తప్పనిసరి అనే కొత్త పద్ధతిని తీసుకురావడం వల్ల పూర్తి స్థాయిలో సౌకర్యం లేని ఇంటర్నెట్ విధానం కూలీలకు శాపంగా మారిందని వాపోయారు. ఉపాధి హామీలో పెరుగుతున్న కూలీల సంఖ్యకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు పెంచి పని కావాలని అడిగిన ప్రతి కుటుంబానికీ ఏటా 200 రోజుల పని కల్పించి, రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, రెండు పూటలా పని, మస్తరు విధానాన్ని తక్షణం రద్దు చేసి ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం 7 మందితో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కాండ్రేగుల ఎస్ఎన్ అప్పారావు, కోడేల వీరగోపాల్, సభ్యులుగా పొలమలశెట్టి వెంకట అప్పలరాజు, యల్లాపు పార్వతి, వరలక్ష్మి, భావన, శేఖర్, మానే కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకురూరల్

భారతదేశ కళ, సంస్కృతి వృద్ధి కోసం పనిచేసే చారు కేస్టిల్ ఫౌండేషన్ గజియాబాద్, ఉత్తరప్రదేశ్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలు గతేడాది జులై నుంచి అక్టోబర్ వరకు జరిగాయి. ఈ పోటీల్లో 15 దేశాల నుంచి విద్యార్థులు పాల్గొనగా స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థినులు 11 మందికి సర్టిఫికెట్స్, మెడల్స్ రావడం గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా 11 మంది విద్యార్థినులను కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, పరిపాలనాధికారి డాక్టర్ డి.సుబ్బారావు, కె.పద్మజారాణి అభినందించారు.

కార్పెంటర్ యూనియన్ కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి - మొగల్తూరు



ఎంపికైన కార్పెంటర్ యూనియన్ నూతన కార్యవర్గం

కార్పెంటర్ యూనియన్ సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కార్పెంటర్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ అధ్యక్షులు గుగ్గిలపు శ్రీనివాస్ అన్నారు. మొగల్తూరులోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కార్పెంటర్ యూనియన్ మొగల్తూరు మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ సంఘం సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సంఘం భవన నిర్మాణానికి భూమిని కేటాయించాలని మొగల్తూరు గ్రామ సర్పంచి పడవల మేరీ సత్యనారాయణను కోరారు. దీనిపై సర్పంచి సానుకూలంగా స్పందించారు. భవన నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా సర్పంచిని సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. మొగల్తూరు మండల గౌరీ శంకర్ కార్పెంటర్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా చింతోజు పాండురంగచారి, కార్యదర్శిగా వరద వీరబాబు, కోశాధికారిగా కొల్ల రాము, పలువురు సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆయా కార్యక్రమాల్లో పశ్చిమగోదావరి జిల్లా సేవా ట్రస్ట్ ట్రెజరర్ లక్కోజు వెంకటసుబ్రహ్మణ్యం, విశ్వ బ్రాహ్మణుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తుపాకుల సోమచారి, నిడదవోలు బ్రహ్మం, చెన్నూరు శివన్నారాయణ, అనకాపల్లి గణపతి, కొడవలూరు పెద్దిరాజు, పలు కార్పెంటర్ యూనియన్ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని మారంపల్లి గ్రామంలో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన గణేష్ కుటుంబానికి జనసేన నాయకులు సాయం చేశారు. జనసేన పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బెడ్‌షీట్స్, వంట సామగ్రి సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తోట సూర్యనారాయణ, రామిశెట్టి సత్తులు, మంగిన బాలాజీ, కనపర్తి గణేష్, మిరియాల విజయకుమార్, తోట మణికంఠ, తోట ప్రసన్నకుమార్, తోట సురేష్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, DARSANAPU SRAVANI, W/o. Kongaleti Suneel Prem Kumar, D.No.6-67/2, V V Nagar, Near Holy Praise Church, Komadavole, Eluru, Eluru District. I hereby declare that my name changed as **DARSANAPU SRAVANI** (New Name) previously called **KONGALETI SRAVANI, W/o. KONGALETI SUNEEL PREM KUMAR** (Old Name) hereafter all my documents and correspondence with this new name **DARSANAPU SRAVANI, W/o. KONGALETI SUNEEL PREM KUMAR.**

తెలుగు భాష అనంతం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తెలుగు భాష అనంతమైందని, భాషకు ఒక ప్రాముఖ్యత ఉందని, తెలుగు భాష దినోత్సవాన్ని వారోత్సవాలుగా నిర్వహించడం అభిందనీయమని సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపల్ డానియల్ మోర్లే అన్నారు. సోమవారం ప్రపంచ మాతృ భాషా దినోత్సవంలో భాగంగా శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్ స్కూలులో విద్యార్థులకు పద్య వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డానియల్ మాట్లాడుతూ తెలుగు భాషను ప్రాచీన భాషగా గుర్తించాన్నారు. నిర్వాహకులు చెరువాడ రంగసాయి మాట్లాడుతూ తెలుగు భాష ఆదరణ లేకుండా పోతుందన్నారు. 124 మంది విద్యార్థులకు పోటీలను నిర్వహించామని, 21న ముగింపు రోజున బహుమతులు అందిస్తామని తెలిపారు.

మాతృభాష మాధుర్యం అందరికీ తెలియజేయాలి

తణుకు : మాతృభాష మాధుర్యం నేటి విద్యార్థులకు తెలియజేయాలని లయన్స్ రీజనల్ చైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్‌లో స్వర్ణ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాతృభాష పరిరక్షణ సమితి వారు వేమన శతకాలను ఐదు వేల మంది చిన్నారులతో ఆలపించారు. అనంతరం సుమారు 500 మంది విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులకు రూ.రెండు వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి వెంకటరావు, బూరుగుపల్లి లలిత, వివిధ స్కూల్స్ యాజమాన్యాలు పాల్గొన్నారు.

'సామాజిక న్యాయానికి సిఎం జగన్ పెద్దపీట'

ప్రజాశక్తి - ఉండి

18 ఎంఎల్‌సి స్థానాల్లో 14 స్థానాలు బడుగు బలహీన వర్గాల మైనార్టీలకు కేటాయించడం హర్షణీయమని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ గౌడ్ అన్నారు. 77 శాతం ఎంఎల్‌సి స్థానాలను బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు ఇప్పటి నుంచే కష్టపడాలని ఆయన సూచించారు.

రేషన్ బియ్యం అందించాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

తమకు రేషన్‌బియ్యం అందడంలేదని, అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు లబ్ధిదారులు పెనుగొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. పెనుగొండ పరిధిలోని 13, 16, 18 వార్డులకు చెందిన పలువురు లబ్ధిదారులు తమకు ఈ నెల రేషన్ బియ్యం అందడంలేదని స్పందన కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి తమకు రేషన్ బియ్యం అందించాలని కోరారు.

ఆక్వా చెరువులకు అనుమతులు ఇవ్వొద్దని...

కాళ్ల : ఏలూరుపాడు గాంధీ బజార్‌లో పంట భూములను చెరువులుగా తవ్వేందుకు అనుమతులు ఇవ్వొద్దని కొండపల్లి మోహనరావు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఆక్వా చెరువుల తవ్వకాల వల్ల భూగర్భ జలాలు పూర్తిగా దెబ్బతిని భవిష్యత్తులో నీటి కోసం ఇక్కట్లు పడే పరిస్థితి ఏర్పడుతుందని మోహనరావు అన్నారు. ప్రజల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని అధికారులు చేపలు, రొయ్యల చెరువులకు అనుమతులు ఇవ్వొద్దని కోరారు.

మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడీషియల్ 1వ తరగతి మెజిస్ట్రేట్ వారి కోర్టులో

ఓ.యస్.నెం. 450/2022

బిట్వీన్:

కర్రి వియజకుమార్ రెడ్డి ...వాది

మరియు

జడ్డు వెంకటేశ్వరరావు ...ప్రతివాది

తండ్రి: సత్యనారాయణ, డో.నెం. 16618-5, ప్లాట్ నెం.18, 7వ వార్డు, అజ్జరం రోడ్‌కు దక్షిణాన, తణుకు-534211, తణుకు మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావా, వాది మీ నుంచి రూ.8,81,138/-లు ప్రామిశరీ నోటు బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా మీరు దావా సమన్లు అందుకొననందున, శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ ఆర్డరు వేసినారు. కావున మీరు **ది.24-03-2023 ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు ఎదుట హాజరు అవ్వనిఎడల మీ పరోక్షమునందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలముగా తమకు తెలియజేయడమైనది.**

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీగోటేటి సత్యవెంకట వరప్రసాద్
అడ్వకేట్స్, తణుకు.
17-02-23. సెల్: 93900 18122

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి తణుకు ప॥గో॥జిల్లా వారి కోర్టులో

ఓ.యస్.నెం. 662/2022

బిట్వీన్:

పెన్మత్స చాంద్ బాబు రాధాకృష్ణ ...వాది

మరియు

సలాది మురళీ కృష్ణ ...ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

ప్రతివాది: సలాది మురళీకృష్ణ, తండ్రి: లేటు అవతారం, వాటర్ సప్లయ్ టాంక్ వద్ద, మొఖాసా కల్వపూడి-521345, మండవల్లి మండలం, లోగడ కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.

పై నెంబరు దావా ప్రామిశరీ నోటు బాకీ రూ.2,91,873/- వసూలు నిమిత్తం దాఖలు చేయగా దావా సమన్లు అందుకొనక మీరు కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా సమన్లు ఆర్డరు వేసినారు. కావున మీరు **ది.07-03-2023 ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల మీ పరోక్షమునందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలముగా తమకు తెలియజేయడమైనది.**

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీగోటేటి సత్యవెంకట వరప్రసాద్
అడ్వకేట్స్, తణుకు.
17-02-23. సెల్: 93900 18122

ప్రకటన

మహారాజశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

Transfer O.P.No. 40 of 2022

పిటీషనర్లు:

1) చుండూరి వెంకట సత్యనారాయణ, తండ్రి: శివప్రసాద్, డో.నెం. 7-133/2, అలంపురం, పెంటపాడు మండలం.

మరియు

రెస్పాండెంటు:

1) వల్లూరి విజయ ప్రకాష్, తండ్రి: సత్యనారాయణ, 43 సం॥లు, డో.నెం. 7-5-18, 15వ వార్డు, పాతవూరు. తణుకు. ప॥గో॥జిల్లా.

పై నెంబరు పిటీషను గ్రంథములో శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ఎన్ని నోటీసులు జారీ చేసినప్పటికీ మీరు హాజరు కానందున మీ హాజరు నిమిత్తం **ది.22-02-2023వ తేదీకి శ్రీ కోర్టు వారు వాయిదా వేసి ఉన్నందున మీరు సదరు తేదీని ఉదయం 10 గంటల నుండి స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి పై నెంబరు పిటీషను పై మీ ఆక్షేపణలు తెలియ చేసుకొనవలసినదిగా** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానము జరుపబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

డి.ఎస్.వి.మాణిక్యాలరావు
ఎన్.వి.ఎస్.ఎస్.పి.రామ మోహన్
ఎన్.వి.ఎస్.రామానుజం
అడ్వకేట్స్, తణుకు.
15-02-23. సెల్: 99088 22433

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 22/2022 in O.S. No. 172/2010

Between:

1. గుడిగంట్ల సూర్యనారాయణ (died) and 2 Others ...D.Hrs

మరియు

1. జెట్టి సాయిబాబా (died) and 3 Others ...J.Drs

4th J.Dr:

జెట్టి లక్ష్మీనాథ్, S/o. late సాయిబాబా, డోర్ నెం. 1-19, Near: వీరబ్రహ్మం గారి టెంపుల్, రాయలం, భీమవరం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు E.P. లో మీకు కోర్టు నుండి ఎన్ని పర్యాయాలు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనుటకు నిరాకరించినందున శ్రీ కోర్టు వారు ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీరు **ది. 10-03-2023 ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక అడ్వకేట్ ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను వినిపించుకోవలసినదిగా తెలియజేయటమైనది. లేనిపక్షంలో మీ పరోక్షమందు శ్రీ కోర్టు వారు తీర్మానించడం జరుగునని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

జి.వి.స్టీఫెన్‌బాబు
పచ్చిగోళ్ళ రమేష్
స్థలం: భీమవరం అడ్వకేట్స్, భీమవరం
తేది:18-2-2023 సెల్:8790950666

ప్రకటన

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, భీమవరం

O.S. No. 24/2022

Between:

శ్రీమతి యర్రంశెట్టి వెంకటలక్ష్మి -వాది

V/s

బండారు వెంకటమణి మరియు వగైరాలు -ప్రతివాదులు

2వ ప్రతివాది: శ్రీమతి బండారు సత్యవతి, W/o. లేటు వెంకట సుబ్బయ్యనాయుడు, కుప్పనపూడి, ఆకివీడు మండలం.

3వ ప్రతివాది: బండారు విక్రమ్, S/o. లేటు వెంకట సుబ్బయ్యనాయుడు, కుప్పనపూడి, ఆకివీడు మండలం.

పై నెంబరు గ్రంధంలో **2వ ప్రతివాది అయిన శ్రీమతి బండారు సత్యవతి మరియు 3వ ప్రతివాది అయిన బండారు విక్రమ్** గార్లకు అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను సమన్లు పంపినను అందుకొనక కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటనకు అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది. 15-03-2023 తేదీకి వాయిదా అయివున్నది. కావున **2వ ప్రతివాది అయిన శ్రీమతి బండారు సత్యవతి మరియు 3వ ప్రతివాది అయిన బండారు విక్రమ్** గార్లు **ది. 15-03-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేటు గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిఎడల సదరు గ్రంథమును **2వ ప్రతివాది అయిన శ్రీమతి బండారు సత్యవతి మరియు 3వ ప్రతివాది అయిన బండారు విక్రమ్** గార్ల పరోక్షమున తీర్మానింపబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

అల్లూరి వెంకటేశ్వరరాజు
అడ్వకేట్, భీమవరం
ప్రాంతం: భీమవరం వాది తరపు అడ్వకేట్
తేది:18-2-2023 సెల్: 9848211102